# నమ్మకద్రోహం*

శ్రీ మోతుకూరు వేంకటేశ్వర్లు

[మంత్రకూట ప్రాంత నిబిడారణ్యము. అడవిగంభీరముగ వుంటుంది — పండువెన్నెలరాత్రి. గుబురుగా పెనవేసుకొన్న చెట్లుగల కీకారణ్యము. ఒకగుబురుచెట్టు క్రీనీడ — శిశువు నిదురించుచుండ ప్రక్కను 'మాణిక్యాదేవి' మేల్కొని వుంటుంది. కొద్ది దూరంలో, కందూరు రాజ్యాధిపతి— 'తైలపదేవుడు' వర్ధమాన పురాధీశ్వరుడు 'భీమరాజు' కలసి మాట్లాడుచుందురు.]

తైల — ప్రభూ! అంతకన్న మాకింకేమీ అవసరము లేదు.

భీమ — (అటు యిటు తిరిగి ఆలోచిస్తూ) సరే కానీ, — మాకు కబురన్నా చేస్తే మా సహాయము ఏమయినా దొరికెడిదే!

తైల — ఏమి చేయగలను. హఠాత్తుగా వచ్చి పడిన — ఆంధ్ర సామ్రాజ్యాధిపుని యెదుర్కొనడానికి అవకాశమేదీ?

భీమ — అయితే, — 'రుద్రదేవ చక్రవర్తి' నీపై పూర్తిగ గక్ష వహించినాడన్న మాట.

తైల — ఇందులో, గక్ష యేముంది — కప్పము కట్టలేదన్న కినుక తప్ప!

భీమ — పాపము, — కారడవుల బడి పరుగెత్తుకొచ్చారు...

తైల — నిస్సహాయులము... ఏమి చేయగలం?

(కొంతసేపు నిశ్శబ్దం — దూరంలో వున్న చెట్టుపైనుండి గుడ్లగూబ వికారంగా అరుస్తుంటుంది.)

భీమ — తైలపదేవా! కొన్ని రాజకీయ విషయాలు నీతో, ఏకాంతముగ మాట్లాడాలి. కొంతదూరం రాగలవా?

తైల — ఆశ్రయమిచ్చిన ప్రభువులకు వ్యతిరేకులమా? ... ... కానీ —

భీమ — ఏమి, నన్ను అనుమా... —

తైల — లేదు ప్రభూ! (సంకోచిస్తూ) ఒంటరిగ యిక్కడ ఆడువాళ్లను వదలి రావడం—...

భీమ — (నవ్వుతూ) అదా నీ సంశయం? చూడు— మన మెంతో దూరము వెళ్లనవసరము లేదు— ఆ ప్రక్కనే—

తైల — (సంశయంతో) మం-చి-దే, కానీ-

భీమ — నీకా అనుమానం అవసరం లేదు. ఈ చుట్టుప్రక్కలనే, నా శిబిరములు నిర్మింపబడి యున్నవి— ఎవరూ రాలేరు యిక్కడికి —

---

* శ్రీ శేషాద్రిరమణకవికృత "వసుంధర" నవలలోని ఒక ప్రకరణం దీనికాధారం.

తైల — చి త్తం—పదండి.

భీమ — (నడుస్తూ) నేను నీ సహాయం— అడుగుతున్నాను. నెరవేరుస్తావా ?—

తైల — మిమ్ముల నే మేము శరణు జొచ్చి నపుడు—...

భీమ — ఇప్పుడు కాదు — చూడు యి క్కడ యింకెవ్వరూ లేరు గద (నలు వైపుల చూచి— ఆగి) మరేమీ లేదు. అహంకారముతో నున్న — ఆంధ్ర సామ్రాజ్యాధిపుని అంత మొందించి—

తైల — (చకితుడై) అందుకు, నా సహా యము కావలయునా ?

భీమ — (వ్యంగ్యముగ) మరి నీవు నీ రాజ్య మును తిరిగి ఏలుబడి చేసుకొంటున్న పరిస్థితులలో చేయలేవా ?—

తైల — (నిట్టూర్పు పుస్తూ) ఇం కెక్కడి నా రాజ్యము ?—

భీమ — ఏమి ? నా సైన్యములతో, నీ రాజ్యముపై, దండెత్తిన దో—

తైల — అంతటి ఆదరణ చూపిన మీకు ధన్యవాదాలు.

భీమ — పిచ్చివాడా! వర్ధమానపురాధీశ్వరు డైన, భీమరాజు వట్టి వాక్శూరుడు గాడు—నిన్ను తిరిగి రాజ్యాభిషిక్తుని చేయగల కార్యశూరుడు.

తైల — (ఆనందముతో) యెంతటి శ్రమ తీసుకుంటున్నారు—కానీ —

భీమ — ఏ మా సందేహం ?

తైల — మన మిప్పుడు అక్కడున్న సేనా నిని బంధించి- సైన్యాలను జయించిన పిమ్మట- 'రుద్రదేవ చక్రవర్తి' పూరు కుంటాడా ?

భీమ — సైన్యాలను నీవూ- వెంటనే సిద్ధ పరచి వుంచితే నేనూ ఆపదకు అడ్డు రాగలను.

తైల — (సంతోషముతో) మంచిదే కానీ,- 'రుద్రదేవచక్రవర్తి' ని మన మెట్లా జయించగలము ?

భీమ — ఏముంది – మనవంటి సామంత రాజులను చేరదీసి కప్పములు కట్ట కుండా, అత న్నెదురిస్తే యేమి చేయ గలడు ?

తైల — మీ సలహా మంచిదే కానీ,- తది తరు లందరూ- ఏకీభవిస్తారా? అని...

భీమ — ఏకీభవించడమన్నది యెంత సేపు- కందూరు రాజ్యాధిపతియైన, 'తైలప దేవుడు'— కొద్దిరోజులలో కప్పము కట్టెద నన్నా వినక - వెంటనే కట్టలే దన్న మిషతో— అతన్ని రాజ్యపద చ్యుతున్ని చేయడం 'రుద్రదేవ చక్ర వర్తి'కి బాగులే దన్న మిషతో- నేను వారి నందరినీ పురిగొల్పనా ?

తైల — (ఆనందముతో గూడిన సంశయంతో)- మన ప్రయత్నము లన్నీ ఆయనకు ముందుగనే తెలుస్తే ?

భీమ — (సగర్వంగా) నిశ్చయించుకున్న దే గా - ఈమాత్రము దానికి వెరవడం దేనికి ?

తైల — అటు లయిన మీ యుక్తి మంచి దనే తలుస్తాను !

భీమ — (అటుయిటు తిరుగుతూ) ఆంధ్ర సామ్రాజ్యాధిపుని అంత మొందించవలయు ననే నే నిదివరకు నిశ్చయించుకున్నాను. కానీ, మార్గములో నీవు నాతో- రెండుసారులు అనవసరముగా నా సైన్యాన్ని వధించావు.

తైల — (వివర్ణుడై) తమ వుద్దేశాన్ని గ్రహించలేకపోయాను—

భీమ — కానీ, మించిపోయినదానికి యేం చేస్తాం? చూడు తైలపదేవా!— ఆ రుద్రదేవ చక్రవర్తితోపాటు, అతని తమ్ముడయిన మహాదేవరాయలను గూడా—మట్టుపెట్టవలయును సుమా.

తైల — అప్పటికి గాని ఆంధ్రసామ్రాజ్యము అడుగంటదు.

భీమ — దానితో గాని, యీ భీమరాజు మనసునకు శాంతి ఏర్పడదు-

తైల — ఆంధ్రదేశచక్రవర్తి అంతరిస్తే- మన కింక అడ్డెవ్వరు?

భీమ — అందుకనే నేను నీ సహాయ మపేక్షిస్తున్నా!

తైల — ఆశ్రయ మిచ్చిన ప్రభువుల కంత మాత్రము సహాయము చేయలేనా?

భీమ — (చిరునవ్వుతో) అప్పుడు నేను కనుపించగలనా— అని నా సందేహం.

తైల — కందూరు రాజ్యమాత తోడుగా- కత్తిపట్టి ప్రతిజ్ఞ చేస్తున్నాను ప్రభూ! (కత్తిని తీసిమూర్ధమున కద్దుకొని — తిరిగి ఒరలో నిముడ్చుకొనును.)

భీమ — (సంతోషమున వీపు నిమురుతూ) నాకు తెలియకనా? ఏమి ప్రత్యుత్తర మిత్తువో యని-

తైల — అంత అవిశ్వాసకుడు కాడీ తైలపదేవుడు- ప్రభూ!

భీమ — మంచిది. మరి. ఆంధ్ర సామ్రాజ్యము పంపకవిషయమున—

తైల — అది తమ యిచ్ఛానుసారముగ—

భీమ — (అటు యిటు తిరుగుతూ ఒకసారి పెద్దగ దగ్గును.)

(వెంటనే పొదలలో ప్రక్క ప్రక్కనే దాగికొని యున్న నలుగురు సైనికులు వచ్చి — తైలపదేవుని చేతులు విరిచి పట్టుకొందురు. తైలపదేవుడు విడిపించుకొనుటకు పెనగులాడును కాని నిస్సహాయు డవును.)

తైల — (కోపముతో) ఛీ— మూర్ఖుడా! భీమరాజా! ఎంత ద్రోహము చేశావు?

భీమ — ఆఁ— ఏమా ప్రగల్భములు?

తైల — (కోపముతో) విశ్వాసఘాతకా!- భీరుడా?- ప్రాణభిక్ష మిచ్చితి నని నమ్మించి- హత్య చేయుటకే నమ్మించితివా? విషకీటకమా! నీవు వసించెడు దేశము నందలి వాయువు సహితము, యీ పనికి—కృతఘ్నవిష సంకులమై పోవదా- (ఒర నున్న కత్తిని లాగ బోవును. సైనికులు బలవంతముగ పట్టుకొందురు.)

భీమ — తైలపదేవా! తైలపదేవా! భీమరాజ పరివారముచే బంధింపబడితి వని గుర్తుదెచ్చుకొనుము—

తైల — ఛీ- భీరుడా! ఎందు కా ప్రగల్భములు. నమ్మించి నన్నరికట్టెదవా? చేతనైనచో కత్తినిపట్టి కదనరంగమునకు నడువుము. కందూరురాజన్యుల కదనకేళి తేటపడగలదు.

భీమ — నోరు మూయుము. అతిగా వాగి
నచో, నీ శిర మిప్పడే ఖండింప
బడును- జాగ్రత.

తైల — అంతకన్న నీవు చేయగల్గున
దేమిరా ?- న న్నీ భటులనుండి- విడి
పించినచో భీమరాజా! నీ వక్షఃకవా
టముపై నిలచి—- నీ హృత్పిండము
నూడబెరికెదనుసుమా-

భీమ —ఎందులకీ మూర్ఖత్వము. (వికటముగ
నవ్వును.)

తెల —ఛీ- పౌరుష జ్ఞానశూన్యుడవైన ద్రో
హివి- నీతో నాకేమి పని-

భీమ — అట్లు అణగి పడి యుండుము -
ఎందు కొచ్చిన వీ ప్రగల్భాలు-

తైల — దుర్మార్గుడా! నీకునూ, నావలెనే
హృదయ ముండుననీ, నిన్నర్థించినందు
లకు మంచిపని చేసితివి.

భీమ — (హేళనముగ) ఓయీ! మేము
నీచే, రెండుమారులు ఓడింపబడిన
వార మని నీకు తెలిసియున్నపుడు-
మేమూ మీకు సహాయపడునది.

తైల — నావలెనే, సంస్థానాధిపతి వని,
సహాయపడుదు వని, ఆశించినందుకు
ద్రోహమున బంధించుట నీ కెంత కీర్తో
ఆలోచించుకొనుము.

భీమ — ఆంధ్రదేశాధీశునిపై కత్తికట్టిన
మమ్ములను, నీవు రెండుపర్యాయములు
యెంతటి చీకాకు పరచితివో మరచి
తివా ?- కృతఘ్నుడా— అరవక పడి
యుండు-

తైల — మాయమాటలచే, రాజకీయములు
మాట్లాడుదు నని నమ్మించి, తెచ్చి
తివే? ముందుగా మేలుకున్న యింత
విపత్తునకు నీకు చిక్కుదునా ?

భీమ — చింత చచ్చిననూ పులుసు చావ
కున్నదే ?

తైల — తెలివిడివాడనే, నాపస వీరు
లేకున్న.

భీమ — అన్యాయంగా మాపై రెండు
సారులు దాడివెడలి, యెంతటి జన
క్షయాన్ని చేశావో గుర్తు వుందా!
దాని కిప్పుడు యిది ప్రతిఫలము.

తైల — ఇడుములలో వున్నమమ్ములను-
ఆశ్రయ మిత్తు నని నమ్మించి- ప్రాణ
ములు తీయుట గొప్ప కాదు.

భీమ — తోక త్రొక్కిన పాము పగ మర
చునా ?

తైల — ధైర్య మున్న ఒంటరిగ రమ్ము-

భీమ — ఆఁ- (అని దగ్గరకు వెళ్లి — చెంపపై
గట్టిగ చరచును.)

తైల — (మహాకోపముతో)- ఏమిరా ?
భీమరాజ్!...భీరూ — కృతఘ్నా!
చిక్కితి ననా నీకీ సాహసము- (కాలి
తో యెగిరి తన్నును.)

భీమ — (కోపముతో) పట్టుబడిన బానిసవు-
పడివుండక- సింహదంష్ట్రిలపై ముష్టి
ఘాతము చేయుటకే దలపడితివా ?- నీ
వంటి తలబిరుసు బందీలను భారత
భూమి మోయలేదు—

తైల — ఆవును. మహామేరువులను, అనంతమయిన సముద్రములను, పర్వతములను భరించగల భారతభూమి, నీవంటి నమ్మికద్రోహులను, కృతఘ్నులను ఒక్క నిమిష మైననూ భరింపలేదు.

భీమ — (కోపముతో కత్తిని దూసి) తైలప దేవా! ఏమా తలబిరుసు? (కత్తితో కంఠమున పొడుచును.)

తైల — ఛీ- ఛీ- పాపాత్ముడా!- ఎంతటి అవినీతి కార్యాన్ని చే-శా-వు.

(తైలపుడు క్రింద పడిపోవును. చంద్రుడిని దట్టమయిన ఒక నల్లని మబ్బు కప్పివేస్తుంది. వికృతంగా నవ్వుకుంటూ భీమరాజ్, సైనికులతో వెళ్లిపోతాడు—గుడ్లగూబ వికారంగా కూస్తుంది...)

( తెర )

---


# మూలవ్యాధి

"ఒక యోగిపుంగవునిచే ప్రసాదింపబడిన అద్భుతమగు ఔషధరాజము"



రక్తము కారుచున్నను. కారకపోయినను, నూతనముగా కలిగినదైనను, చిరకాలమునుండి ఉన్నదైనను పైభాగముననున్నను, లోపలిభాగముననున్నను. ఎట్టిస్థితిలోనున్నను ఆర్షమార ఒకసారి పూసినచో అమోఘముగా పనిచేయును. బాధ, దురద, మంట, చీము, నెత్తురుకారుట, వెంటనే ఆగిపోవును. మూడుదినములు వాడినంతనే యెంతటిమొండిదైన మూలశంఖగాని, భగందరముగాని శస్త్రచికిత్స లేకయే పూర్తిగాకుదురును. వేలకొలదిమందిరోగులు ఈమందువలన ఉపశమనముబడసి, తదితరులకు శిఫార్సు చేయుచున్నారు. కుదురకపోయినచో సొమ్మువాపసు చేయబడును. ఖరీదు రు. 2-0-0.

**AROGYA SADAN,**

**ఆరోగ్యసాధ్గ, దుర్గాదేవి వీధి, బొంబాయి**

